క్లుప్తంగా

చెత్తను తొలగించారు..

సాక్షి ఎఫెక్ట్..

డోర్నకల్: స్థానిక జెడ్పీహెచ్ఎస్ నుంచి నిర్మలా స్కూల్‌కు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను శుక్రవారం మున్సిపాలిటీ సిబ్బంది తొలగించారు. 'సాక్షి' దినపత్రికలో వెలువడిన కథనంపై స్పందించిన సిబ్బంది హుటాహుటిన రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించారు.

మండల వాసికి కఠిన సేవా పతకం



చిన్నగూడూరు: మండల కేంద్రానికి చెందిన గాడిపెల్లి సంతోష్ కుమార్‌కు పోలీస్‌శాఖ విభాగంలో కఠిన సేవా పతకం వరించింది. కొత్తగూడెం ఆరో బెటాలియన్‌కు చెందిన సంతోష్ కుమార్ వరంగల్ జిల్లా మామునూర్ 4వ బెటాలియన్‌లో ఆర్ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పతకం అందుకున్నారు.

ప్రజల ఆరోగ్యమే ముఖ్యం

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని డివైడర్ల మధ్యలో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే కోనో కార్పస్ మొక్కలను తొలగించి, వాటి స్థానంలో వేరే మొక్కలు నాటినట్లు మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, కౌన్సిలర్ మార్నేని శ్రీదేవి, పర్యావరణ అధికారి క్రాంతి, నాయకులు రఘు, ఖలీల్, కిరణ్ పాల్గొన్నారు.

అండగా ఉంటా..



కొత్తగూడ: ఏజెన్సీ గ్రామాల కష్టసుఖాల్లో అండగా ఉంటానని మంత్రి సీతక్క తనయుడు కుంజ సూర్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీతక్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. మండలంలో విషజ్వరాలు ప్రభలుతున్నాయనే విషయం తెలియగానే వైద్య శిబిరం నిర్వహించేందుకు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మల్లెల రణధీర్, నాయకులు పాల్గొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

కురవి: మండల కేంద్రంలోని సిద్దార్థ హైస్కూల్‌లో ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు అడ్మిషన్లు ప్రారంభం అయినట్లు శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం అల్వాల కార్తీక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు తీసుకునే అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నంబర్‌ను 98852 14380 సంప్రదించాలని ఆయన సూచించారు.

అక్రమంగా మట్టి తరలింపు

మరిపెడ రూరల్: మండలంలోని గుండెపుడి శివారు పట్టా భూమిలోని మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై కఠిన చర్య తీసుకోవాలని గ్రామానికి చెందిన బాధిత దళిత రైతులు వండ్లకొండ మల్సూర్, వండ్లకొండ వీరన్న శుక్రవారం డిమాండ్ చేశారు. గ్రామ శివారు 430 సర్వే నంబర్‌లోని అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వం మాకు 30 గుంటల చొప్పున పట్టాలిచ్చిందన్నారు. సదురు భూమిలో గుండెపుడి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు జేసీబీ పెట్టి ట్రాక్టర్ల ద్వారా వందలాది ట్రిప్పుల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని బాధిత రైతులు వేడుకుంటున్నారు.

నిబంధనలు పాటించాలి

తొర్రూరు రూరల్: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ జగదీష్, ఎస్సై ఉపేందర్ సూచించారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో తొర్రూరు మండలంలోని అన్నిగ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

సంబురాలు

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం శాసన మండలి సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా శుక్రవారం తెలంగాణ జనసమితి జిల్లా నాయకులు స్వీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో జనసమితి జిల్లా అధ్యక్షుడు డోలి సత్యనారాయణ, కార్యదర్శి సుధాకర్, నాయకులు మనోజ్, రవినాయక్, గౌస్‌పాషా పాల్గొన్నారు.

క్రీడాకారుల ఎంపిక

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేటినుంచి జరగనున్న అండర్–16 పాఠశాల, కళాశాల స్థాయి పోటీలకు జిల్లాకు చెందిన భామనపల్లె ధర్మచరణ్ రెడ్డి, వెల్డి చిన్మయితేజ్, మామిండ్లపల్లి తరుణ్ ఉమ్మడి వరంగల్ జట్టు తరఫున ఎంపికయ్యారని క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి అజయ్ సారథిరెడ్డి శుక్రవారం తెలిపాడు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలు

శ్రావణమాసంలో వరలక్ష్మీవ్రతంను పురస్కరించుకొని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో, ఇళ్లలో మహిళలు లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించి, ఇష్టమైన పిండి వంటలు చేసి ప్రసాదాలు సమర్పించి లక్ష్మి అష్టోత్తరం పారాయణం నిర్వహించారు. అనంతరం మహిళలను ఇళ్లకు పిలిచి వాయినం ఇచ్చిపుచ్చుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



దోర్నకల్: సామూహిక వరలక్ష్మీ వ్రతం..



మానుకోటలో వ్రత పూజలో పాల్గొన్న మహిళలు



నర్సింహులపేటలో..



గార్ల: లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో..



చిన్నగూడూరు: వాయినాలు ఇస్తున్న భక్తురాలు



మహబూబాబాద్ రూరల్: కంబాలపల్లి గ్రామంలో..



కేసముద్రం ఆలయంలో..



గూడూరు: పూజలో పాల్గొన్న మహిళలు

సీతారామ ప్రాజెక్టు నీరు అందించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

నెహ్రూసెంటర్: ఏజెన్సీ ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు నీటిని అందించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న అన్నారు. ఏజెన్సీ ప్రాంతాలకు నీటిని అందించాలనే డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్యభవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజా ఉద్యమకారులు, ప్రజా ప్రభుత్వం అంటూ చెబుతున్న కాంగ్రెస్ సీతారామ ప్రాజెక్టు నీటిని తమకు అనుకూల ప్రయోజనాలకు వినియోగిస్తూ ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు కాంగ్రెస్ తిప్పలుపడుతుందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు నీటి కేటాయింపులపై సీఎంను కలిసేందుకు వెళ్తున్న నాయకులను పోలీసులు కొట్టడం, దుర్భాషలాడడం ఎంత వరకు సమంజసమన్నారు. నాయకులపై చేయి చేసుకున్న సీఐ సత్యనారాయణను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీపీ జాక్ బాధ్యుడు మైస శ్రీనివాస్, సీపీఎం జిల్లా నాయకులు గునిగంటి రాజన్న, మార్తినేని పాపారావు, నందగిరి వెంకటేశ్వర్లు, హలావత్ లింగన్న పాల్గొన్నారు.

దళారీ వ్యవస్థను కట్టడి చేయాలి



మాట్లాడుతున్న ఉప్పలయ్య

మరిపెడ రూరల్: లేబర్ కార్యాలయాల్లోని దళారీ వ్యవస్థను తక్షణమే కట్టడి చేసి నిజమైన బిల్డింగ్ నిర్మాణ కార్మికుల సంక్షేమానికి లేబర్ కార్డును అందించాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షుడు కొండ ఉప్పలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్మాణ వ్యవస్థకు సంబంధం లేని వ్యక్తులకు ఇన్సూరెన్స్ కార్డులను అందించి అసలైన కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు బండ వీరస్వామి, సంఘం నాయకులు బిక్షం, సైదులు, లక్ష్మణ్, సూరరావు, మహేష్, నరేష్, శ్రీను, వెంకన్న, గంధసిరి శ్రీను, రమేష్, ఉపేందర్, మదార్, ఉపేందర్, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

మీ నిర్లక్ష్యంతో రైతులు సంతోషంగా లేరు

- విద్యుత్ అధికారుల తీరుపై ఎమ్మెల్యే మురళీనాయక్ ఆగ్రహం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: పదేపదే కరెంటు పోతుండడంతో రైతులు సంతోషంగా లేరని, దీనికి కారణం మీ నిర్లక్ష్యమే అని విద్యుత్ శాఖ అధికారులపై ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో నిర్వహించిన మండలస్థాయి అధికారుల సమీక్షా సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ అధికారులను ఉద్దేశించి మాట్లాడారు. గత ప్రభుత్వం కంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మెరుగైన విద్యుత్ ఇస్తుందన్నారు. కాని అధికారులు సక్రమంగా సరఫరా చేయడంలేదని, దీంతో కొన్నిచోట్ల రాత్రి సమయం కరెంటు పోతూ, తెల్లవారుజామున వస్తుందన్నారు. కొంతమంది విద్యుత్‌శాఖ అధికారుల తీరు వలన రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఉప్పరపల్లి రోడ్డు వైపు గిరిజనబాలికల హాస్టల్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని, ఉప్పరపల్లిలో ఎర్రకుంట చెరువు పూడ్చిన విషయంపై విచారణ జరపాలని తహసీల్దార్‌కు ఎమ్మెల్యే సూచించాడు. కార్యక్రమంలో తహసీల్దార్ దామోదర్, ఎంపీడీఓ హరిప్రసాద్, కేసముద్రం, ధన్నసరి సొసైటీల వైస్ చైర్మన్లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, ఏఓ వెంకన్న, అధికారులు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కేటీఆర్ మహిళలకు క్షమాపణ చెప్పాలి



మహబూబాబాద్ రూరల్: కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



గూడూరు: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్ రూరల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు వెంటనే క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య డిమాండ్‌చేశారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూసెంటర్ వద్ద శుక్రవారం కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చెన్నూరు విజయలక్ష్మి, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు భూక్య శ్రీను, ఆరెంపుల విజయ, నాయకులు సురేష్, రమేష్, రాందాసు, వంశీ, అన్సారీ పాల్గొన్నారు.

గార్ల: ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం విషయంలో రాష్ట్ర మహిళలను ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ దిష్టిబొమ్మను శుక్రవారం గార్లలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దహనం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు, సుందర్, లెనిన్, కుమార్‌గౌడ్, అశోక్, రామ్‌సింగ్, వీరస్వామి పాల్గొన్నారు.

గూడూరు: మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కేటీఆర్ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్నయాదవ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు బీరం శ్రీపాల్‌రెడ్డి, వాంకుడోతు కొమ్మాలునాయక్, ఎలమందల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నెల్లికుదురు: కాంగ్రెస్ ప్రభుత్వంపై అక్కస్సుతో మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేటీఆర్ క్షమాపణ చెప్పాలని, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మాజీ మంత్రి కేటీఆర్ దిష్టబొమ్మ దహనం చేశారు.

గ్రామదేవతల ఒడిలోనే ప్రజలు సుభిక్షం



పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ ప్రకాశ్, ముదిరాజ్‌లు

దంతాలపల్లి: గ్రామ దేవతల ఒడిలోనే ప్రజలు సుభిక్షంగా ఉంటారని ఎమ్మెల్సీ బండ ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలో ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో పెద్దమ్మ తల్లి, పోతరాజు విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమానికి శుక్రవారం ఎమ్మెల్సీ హాజరయ్యారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల కుల దైవం అయిన పెద్దమ్మ తల్లిని ప్రతిష్ఠించుకోవడం సంతోషంగా ఉందన్నారు. గ్రామ దేవతల ఆలయాలు సంస్కృతి సంప్రదాయాలకు ఆనవాళ్లు అని మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు నర్సయ్య, అశోక్, ఎల్లయ్య, సురేష్, మల్లేశ్, నాయకులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని వాజ్‌పేయికి ఘన నివాళి



మహబూబాబాద్ అర్బన్: వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మోసంగి మురళీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యాప సీతయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మాధవపెద్ది శశివర్ధన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ధార హిందు భారతి, నాయకులు శ్యాంసుందర్‌శర్మ, రాజుగౌడ్, సందీప్, ప్రశాంత్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

వాజ్‌పేయి సేవలు మరువలేము

తొర్రూరు: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి సేవలను ఎప్పటికీ మరచిపోలేమని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్ అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని వాజ్‌పేయి వర్ధంతని పురస్కరించుకొని ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బెడ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పల్లె కుమార్, కిన్నెర యాదగిరి, పైండ్ల రాజేశ్, గడల శేఖర్, కాగు నవీన్, రాజ్ కుమార్, చలపతిరాజ్, నూకల నవీన్, శీలం శ్రీనాథ్ పాల్గొన్నారు.

పాపన్నను ఆదర్శంగా తీసుకోవాలి



గూడూరు: మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

గూడూరు: బహుజనుల రాజ్యాధికారం కోసం ఉద్యమించి అసువులు బాసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌ను గౌడ కులస్తులు ఆదర్శంగా తీసుకోవాలని గోపా సంఘం జిల్లా నాయకుడు చిత్తలూరి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం మండల గోపా సంఘం ఆధ్వర్యంలో పాపన్న జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కుర్ర శ్రీనివాస్, బెల్లంకొండ శ్రీనివాస్, చీకటి శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు.

కేసముద్రం: మండల కేంద్రంలో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమాన్ని కేజీకేఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేజీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి బూడిదగోపి, గోపా డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు యమగాని వెంకన్న, సమ్మయ్యగౌడ్, ఉప్పలయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

డీఈఓను తొలగించాలి



మాట్లాడుతున్న రామ్మూర్తి

నెహ్రూసెంటర్: వివాదాస్పద డీఈఓను విధుల నుంచి తొలగించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి అన్నారు. జిల్లా కేంద్రంలోని సంఘ కార్యాలయంలో కేవీపీఎస్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో జిల్లాలో అనేక తప్పులు జరిగాయని ఆరోపించారు. ఎస్సీ మహిళా ఉపాధ్యాయుల పదోన్నతుల్లో చిన్నచూపు చూడడం, అవమానించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో మహేందర్, ఎల్లయ్య, వెంకట్రాములు, ప్రశాంత్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నావికాదళ ఉద్యోగికి సన్మానం

నెల్లికుదురు: మండలంలోని శ్రీరామగిరి గ్రామానికి చెందిన గొల్లపల్లి కేశవశ్రీ అండమాన్ దీవుల్లో ఉద్యోగ రీత్యా భారత నావిక దళంలో సెలక్ట్ అయ్యాడు. ఈసందర్భంగా గురువారం రాత్రి వివేకానంద సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో కేశవశ్రీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి ఆదూరి కళాధర్ రాజు, పోరండ్ల శ్రీనివాస్, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే రుణమాఫీ

నర్సింహులపేట: రాష్ట్రంలోని రైతులకు కాంగ్రెస్ హయాంలోనే రూ.2లక్షల రుణమాఫీ అయిందని కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు జినుకల రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడారు.

ఎంపీడీఓకు సన్మానం

పెద్దవంగర: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్దవంగర మండలానికి చెందిన ఎంపీడీఓ వేణుమాధవ్ ప్రశంసపత్రం అందుకున్నాడు. కాగా శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో ఆయనను స్థానిక నాయకులు ఘనంగా సన్మాంచారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సురేష్, నాయకులు శ్యామ్, రంగు మురళి, బీసు హరికృష్ణ పాల్గొన్నారు.

ఉపాధ్యక్షుడిగా శేఖర్



దంతాలపల్లి: బీజేపీ దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా మండల కేంద్రానికి తూర్పాటి శేఖర్‌ను నియమిస్తున్నట్లు జిల్లా దళిత మోర్చా అధ్యక్షుడు తూర్పటి సాయి ముఖేష్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మరిపెడ రూరల్: నర్సింహులపేట మండలం పెద్దనాగారం సబ్‌స్టేషన్ పరిధిలోని రాంపురం, చిల్లంచర్ల, కొత్తూరు, నీలికుర్తి, పర్కజలతండాలకు నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బి.అజయ్ శుక్రవారం తెలిపారు. కొత్త ఫీడర్ ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ అంతరాయం నేడు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఉంటుందని తెలిపాడు. ఇందుకు రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పాలాభిషేకం

మహబూబాబాద్ రూరల్: రైతు రుణమాఫీ ప్రతిష్టాత్మకంగా అమలు చేసి, సీఎం రేవంత్ రెడ్డి రైతు బాంధవుడిగా మారారని అమనగల్ మాజీ సర్పంచ్ పూజారి మంగమ్మవెంకన్న అన్నారు. గ్రామంలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. దామోదర్ రెడ్డి, పుల్లయ్య, సందీప్ రెడ్డి, శ్రీను, పుల్లయ్య పాల్గొన్నారు.

నిధులు కేటాయించండి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని సీపీఐ నాయకులు పెరుగు కుమార్, చింతకుంట్ల వెంకన్న కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన వార్డుబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 21,23,24 వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాగెల్లి యాకమ్మ, ఎర్రోజు పద్మ, శ్రీను, రమేష్, షబ్బీర్, రమేష్, సుజాత, ప్రమీల పాల్గొన్నారు.

ఏఓ మంజుఖాన్ బదిలీ

కురవి: మండల వ్యవసాయ శాఖ అధికారి మంజుఖాన్ బదిలీ అయినట్లు శుక్రవారం తెలిపాడు. కురవి మండల ఏఓగా 12ఏళ్లుగా పనిచేసి ఖమ్మం జిల్లా వైరా మండల వ్యవసాయ శాఖ అధికారిగా బదిలీపై వెళ్తున్నట్లు ఆయన తెలిపాడు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో ఏఓగా విధులు నిర్వహించిన నరసింహారావు కురవి ఏఓగా బదిలీపై రానున్నారు.

జయప్రదం చేయండి

నెహ్రూసెంటర్: ఈనెల 18వ తేదీన బహుజన విప్లవకారుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని గౌడ జనహక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు ముంజాల రాజేందర్‌గౌడ్ శుక్రవారం పిలుపునిచ్చారు.

బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్‌గా శోభన్‌నాయక్



కేసముద్రం: బీజేవైఎం మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్‌గా మండలంలోని ధన్నసరి గ్రామానికి చెందిన దారావత్ శోభన్‌నాయక్ ఎన్నికైనట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మట్టి తరలింపుపై విచారణ

కేసముద్రం: కేసముద్రంవిలేజ్ సమీపంలో మూతబడిన ఓ క్వారీ నుంచి అక్రమంగా మట్టి తరలిస్తున్నారనే సమాచారం మేరకు, తహసీల్దార్ దామోదర్ శుక్రవారం ఆట్టి స్థలాన్ని పరిశీలించారు. విచారణ జరిపి చర్య తీసుకుంటామని తెలిపారు.

కూచిపూడిలో విద్యార్థిని ప్రతిభ



తొర్రూరు రూరల్: జాతీయస్థాయి పోటీల్లో అయోధ్యలో ఇటీవల జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శనలో తొర్రూరు అభ్యాస్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని ఎనమాల ఐవీ ప్రతిభను కనబర్చి మెరిట్ సర్టిఫికెట్ తోపాటు బహుమతి పొందింది. శుక్రవారం డివిజన్ కేంద్రంలోని స్కూల్‌లో విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కేతిరెడ్డి నరేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుమలత పాల్గొన్నారు.

వీల్‌చైర్స్ అందజేత

తొర్రూరు రూరల్: మండలంలోని మాటేడు గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధులకు లయన్స్ క్లబ్ సేవా తరుణి వారి ఆధ్వర్యంలో శుక్రవారం చేయూతనిచ్చారు. ప్రధానంగా క్లబ్ చైర్మెన్ వజినపెల్లి శైలాజ, శ్రీనివాస్ దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సుమారు రూ.10వేల విలువ చేసే వీల్‌చైర్స్‌ను వృద్ధులకు అందించారు.

విద్యార్థులను ఇంటికి పంపాలని నిరసన

మరిపెడ రూరల్: రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకొని విద్యార్థులను ఇంటికి పంపించాలని విద్యార్థులు తల్లిదండ్రులు మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థులకు క్లాసులు జరుగుతున్నాయని, నాలుగు, ఐదు రోజులు సెలవులు ఇవ్వడం కుదరదని, పండుగ రోజు మాత్రమే సెలవు ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ దయాకర్ తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

రేగొండ: తొర్రూరు మండలం ఉడిపిరాల గ్రామానికి చెందిన శ్రీపతి ఉపేంద్ర చారి బంధువులతో కలిసి కాళేశ్వరం వెళ్లి శుక్రవారం తిరిగి వస్తున్నాడు. భాగిర్థిపేట శివారులో మూత్ర విసర్జన కోసం వాహనం ఆపి రోడ్డు దాటుతుండగా మైలారం గ్రామానికి చెందిన బుర్ర కుమారస్వామి ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఉపేంద్రచారి కాళ్లు విరగగా.. కుమారస్వామి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వారసత్వదారుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన తెలుపుతున్న వాటాదారులు

తొర్రూరు: వీఆర్ఏలుగా విధులు నిర్వరిస్తున్న వారసత్వ వాటాదారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయా గ్రామాలకు చెందిన బాధితులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల బాధితులు మాట్లాడుతూ.. అనేక ఏళ్లుగా ప్రతి ఏడాదికి ఒక్కరు చొప్పున గ్రామాల్లో విధులు నిర్వరిస్తూ తమ జీవనాన్ని కొనసాగించేవారమన్నారు. గత ప్రభుత్వం వారసత్వదారుల్లోని వాటాదారులను సంప్రదించకుండా అసలుదారుడిని పర్మినెంట్ చేయాడం ద్వారా తమ జీవితాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బాధితులు ఎస్‌కే షరీఫ్, సంపత్, సంతోష్, రామచంద్రు, హుస్సేన్, సైదా, మొయిద్దిన్, ఖాసీం, సాయి పాల్గొన్నారు.